# విముక్తిలేని శాపం

న్యూట్రాన్

**ఆయన ఒకపట్టాన ఒప్పుకోలేదు. అయితే ముందు తాము రెండు షరతులు పెట్టారు. ఒకటి-తన అధీనంలోవున్న బ్రాంచి ఆఫీసు రిపోర్టులు తన నిర్లక్ష్యం కారణంగా మిస్‌ప్లేస్ అయినట్లుగా రాజు వ్రాసివ్వాలి రెండు-పరిస్థితి తన లెవల్ దాటిపోయేట్లయితే జరిగింది చెప్పటం...**

"మిష్టర్ రాజూ! సెక్షను ఇన్‌ఛార్జి పంమేశంగారు అసిస్టెంటును పిలిచారు.

"యస్ సార్!" అన్నాడు రాజు తను చూస్తున్న ఫైలులోంచి తల పైకెత్తకుండానే.

"మన నాలుగు బ్రాంచి ఆఫీసుల నుంచి రిపోర్టులు వచ్చాయా"

"వచ్చాయి సార్" అన్నాడు రాజు.

"హెడ్డాఫీసుకు మన స్టేట్‌మెంట్ ఎప్పుడు వెళ్ళాలి"

"ఇంకా వారం రోజులు టైముంది"

"మనం పంపవలసిన స్టేట్‌మెంట్‌కి డ్రాఫ్టు రడీచేసి వుంచు. జోనల్ మేనేజరుగారు కాంప్ నుంచి ఎల్లుండి రావచ్చు. వారు రాగానే అప్రూవర్ కోసం పుటప్ చేద్దాము" అన్నారు పరమేశంగారు తన బాధ్యతవరకూ చెబుతున్నట్టుగా.

"ఓ.కే. సార్" అన్నాడు రాజు.

"అయతే ఒకటి. బ్రాంచి ఆఫీసు వాళ్ళు పంపిన పాయింట్స్ అన్నిటినీ, మన స్టేట్‌మెంటు 'కవర్' చెయ్యాలి, ఆ విషయం మరిచిపోవద్దు".

"యస్ సార్"

ఒక పెద్ద వ్యాపారసంస్థకి అది ఒక జోనల్ ఆఫీసు. వారి హెడ్డాఫీసు బొంబాయిలో ఉంది. ఈ జోనల్ ఆఫీసు క్రింద నాలుగు బ్రాంచి ఆఫీసులు వేర్వేరు పట్టణాలలో వున్నాయి.

జోనల్ ఆఫీసులో మొత్తం పది మంది స్టాఫ్ వున్నారు. వీరుకాక ఒక ఆఫీసుఇన్‌చార్జి, ఒక జోనల్ మేనేజరు వున్నారు.

ఆ ఆఫీసులో అంతా పాతవాళ్ళే. ఒక్క రాజు తప్ప. అతను ఆఫీసులో ప్రవేశించి ఒక సంవత్సరకాలం అయింది. రాజు యువకుడు. ఇంకా బ్రహ్మచారి. ఉత్సాహంగా చురుకుగా పని చేసుకుంటూ పోతాడు. అతని సామర్థ్యం చూసి కొన్ని ముఖ్యమైన పనులు అతనికి ఎడిషనల్‌గా ఎంట్రస్ట్ చేయటం జరిగింది.

మరునాడు ఉదయం రాజు తాను తయారు చేయవలసిన స్టేట్‌మెంట్ తాలూకు సరంజామా అంతా ముందు వేసుకు కూర్చున్నాడు.

హెడ్డాఫీసు నుంచి వచ్చిన ఓల్డు కరస్పాండెన్సు, ఇంకా ఇతర రిఫరెన్సులుగల ఫైల్సు అన్నీ వున్నాయి. కానీ బ్రాంచి ఆఫీసుల వాళ్ళు పంపిన రిపోర్టులు లేవు.

ఆ నాలుగు బ్రాంచీలనుంచి వచ్చిన నాలుగు కాగితాలను ఒక ఫోల్డరులో పెట్టినట్టు తనకు గుర్తు. ఇప్పుడు ఆ ఫోల్డరు కనపడటం లేదు.

ఆఫీస్ ఇన్‌ఛార్జి పరమేశంగారు ఆ ఫోల్డరును తీసారేమో అనుకున్నాడు రాజు.

"సార్"

"యస్ ప్లీజ్" అన్నారు పరమేశంగారు.

"మన బ్రాంచి ఆఫీసు వాళ్ళు పంపిన రిపోర్టులు మీ వద్ద వున్నాయి"

"లేవే! నా వద్ద ఎందుకుంటాయి?"

"నిన్న సాయంత్రం వరకు వాటిని వుంచిన ఫోల్డరు నా టేబుల్‌మీద వుంది. ఇవాళ ఆ ఫోల్డరు కనబడటం లేదు. దాంతో పనిబడి మీరు తీసారేమోనని అడిగాను"

"అబ్బే! నేను తియ్యలేదు, అదెక్కడో ఇతర ఫైళ్ళ మధ్య పొరపాటున పెట్టావేమో. మళ్ళీ వెతుకు" అన్నారు పరమేశంగారు.

రాజు తన టేబులు, రాక్, అలమరా అంతా క్షుణ్ణంగా వెతికారు. కానీ కావలసిన వస్తువు దొరకలేదు.

తన కొలీగ్స్‌నందరినీ అడిగి చూశాడు. పొరపాటున అది వాళ్ళ టేబులుమీదకి వచ్చిందేమోనని. కానీ లాభం లేకపోయింది.

రాజుకి చెమటలు పట్టేశాయి.

రేపు జోనల్ మేనేజరు కాంపు నుంచి వస్తారు. ఈలోగా హెడ్డాఫీసుకు వెళ్ళవలసిన స్టేట్‌మెంటు తయారుకావాలి. కానీ ఇంతలో అవాంతరం వచ్చిపడింది. తన ఛార్జిలోవున్న ఫోల్డరు కనపడటం లేదు అంటే అది తన నిర్లక్ష్యాన్ని తెలియచేస్తుంది. ఇది తన 'కెరీర్'కే దెబ్బ.

ఎందుకైనా మంచిదని మళ్ళీ ఒకసారి తన టేబులు అంతా వెతికాడు. అలమరా అంతా తలక్రిందులు చేసాడు. అయినా అది దొరకలేదు.

బ్రాంచి ఆఫీసువాళ్ళు పంపిన రిపోర్టులు వుంచిన ఫోల్డరు "మిస్‌ప్లేస్" అయిన సంగతి రూఢి అయిపోయింది.

అది ఇక్కడే ఎక్కడో వుందని తప్పకుండా దొరుకుతుందన్న నమ్మకంతో ఇంతసేపూ తను నిబ్బరంగా వున్నాడు. కానీ అది

ఎంతకి దొరక్కపోవటంతో రాజుకి ఏం చేయాలో తోచక నిసత్తువుగా కుర్చీలో కూలబడిపోయాడు.

ఇంతలో పరమేశంగారు ఆ స్టేటుమెంటు గురించి మళ్ళీ గుర్తుచేసారు.

"సార్ ! మన బ్రాంచి ఆఫీసులనుంచి వచ్చిన రిపోర్టులు కనబడటం లేదు" అన్నాడు ధైర్యం తెచ్చుకుని.

"వాట్డూయూమీన్" అంటూ పరమేశం గారు భూకంపం వచ్చినంతగా కంగారు పడిపోయారు.

"యస్ సార్ ! నిన్న సాయంకాలం వరకు ఆ ఫోల్డరు నా టేబులు మీదవుంది కానీ ఇప్పుడు లేదు."

"అంతా వెతికావా"

"యస్ సార్"

"ఇప్పు డెలాగయ్యా ! రేపు జోనల్ మేనేజరుముందు ఆ స్టేట్‌మెంటు పుటప్ చేయకపోతే కొంపలంటుకుంటాయి. ఇలాంటి సమయంలో బ్రాంచి రిపోర్టులు కనబడటం లేదు అంటే ఏమిటి నీవుద్దేశం. అది కనబడకపోతే ముందునేను ఇరుక్కుపోతాను. ఇప్పుడు ఏం చేయాలి ?" అంటూ పరమేశంగారు మండిపడ్డారు.

"మీరే ఏదైనా ఆలోచించండి" అన్నాడు రాజు, అంతా మీదయ అన్నట్టుగా.

పరమేశం గారు వెంటనే స్టాఫ్ అందరినీ పిలిచి జరిగిన విషయం చెప్పి తమ తమ టేబులు, అలమరాలు అన్నీ చెక్‌చేసి వాళ్ళ దగ్గర పొరపాటున ఆ ఫోల్డరు వుండి పోయిందేమో చెప్పమన్నారు.


అరగంట తరువాత తమవద్ద అలాంటి ఫోల్డరు ఏమీ లేదని అంతా తేల్చి చెప్పారు.

రాజుకి కాళ్ళు చల్లబడిపోయాయి. ఈ విషయం జోనల్ మేనేజరుకి తెలిస్తే పరిణామాలు చాలా తీవ్రంగా వుంటాయి. ఆఫీసు పనిలో తాను నిర్లక్ష్యంగా వున్నందుకుగాను తనకి ఎంతటి శిక్ష ఆయినా విధించవచ్చు. తన ఉద్యోగం వూడినా వూడవచ్చు.

తనకి ఉద్యోగం పోయినట్లు, తను రిక్షా తొక్కుతున్నట్లు, రోడ్డుమీద అడుక్కు తింటున్నట్లు ఇంకా అనేక రకాలుగా భయంకరమైన ఆలోచనలు మనసులో మెదల సాగాయి.

కర్తవ్యం బోధ పడలేదు రాజుకి.

తన మిత్రులు అనబడేవారు నలుగురినీ పోగుచేసి వచ్చిన ఆపదనుంచి తప్పించుకోవాలంటే మార్గం సూచించవలసిందిగా కోరాడు.



"ఏది ఏమైనా మన ఇన్‌ఛార్జి పరమేశం గారి సహకారం లేకుండా ఏదీ సాధ్యపడదు

"అదీ కరక్టే !. పరమేశంగారి సహాయం లేకుండా మనం చేయగలిగింది ఏమీ లేదు. ఈ విషయం జోనల్ మేనేజర్‌గారికి తెలియపరచ వద్దని రిక్వెస్టుచేద్దాము. ఏదో విధంగా మానేజ్ చెయ్యమని కోరదాం !" తర్జనభర్జనల అనంతరం నిర్ణయించారు మిత్రులు.

అంతా కలిసి పరమేశం దగ్గరకు వెళ్ళారు. ఆయన ఒక పట్టాన ఒప్పుకోలేదు. అయితే ముందు తాను రెండు షరతులు పెట్టారు.

ఒకటి-తన ఆధీనంలో వున్న బ్రాంచి ఆఫీసు రిపోర్టులు తన నిర్లక్ష్యం కారణంగా మిస్‌ప్లేస్ అయినట్లుగా రాజు వ్రాసి ఇవ్వాలి.

రెండు-పరిస్థితి తనలెవల్ దాటిపోయేటట్లయితే జరిగింది జరిగినట్లు జోనల్ మేనేజరుకు చెప్పటం. అందువల్ల వచ్చే ఫలితం పూర్తిగా రాజుదే.

రాజుతోసహా అందరూ సరే అన్నారు.

ఆ తరువాత ఆ విషయానికి సంబంధించిన ఫైల్సు అన్నిటినీ పరమేశంగారు తీసుకొని, దాన్ని ఇకపై తానే "డీల్" చేయబోతున్నట్లుగా రాజుతో చెప్పారు.

అంతటితో రాజుకి కొంత ప్రశాంతత లభించింది.

ఆ సాయంకాలం అంతా ఆఫీసు వదిలి వెళ్ళిపోయారు. పరమేశంగారు, రాజు ఇంకా వెళ్ళలేదు.

ఇంతలో పరమేశంగారు రాజుని పిలిచారు.

"మిష్టర్ రాజూ ! నీ వల్ల జరిగిన పొరపాటుకు నిన్ను సర్వీసునుంచి టెర్మినేటుచేసినా చేయవచ్చు. ఆ విషయం నీకు తెలుసనుకుంటాను" అన్నారు.

"అవును సార్, ఈ విషయంలో మీరు ఎలాగైనా నన్ను కాపాడాలి" అంటూ చేతులు జోడించాడు రాజు, అంత కంటే ఇంకొక మార్గంలేక.

"అది అంత తేలికపనికాదు"

"మీరు తలుచుకుంటే ఎలాగైనా ఈ విషయం జోనల్ మేనేజరుకి తెలియకుండా ఏర్పాటుచేయగలరు. మీరు కాదంటే నేను చిక్కుల్లో ఇరుక్కుపోతాను. ఇప్పుడు నేనున్న పరిస్థితులలో మీరే నన్ను కాపాడగలరు"

"చూడురాజూ! ఇది నీ జీవితానికి సంబంధించిన సమస్య. నిన్ను ఈ ఆపదనుంచి తప్పించే బాధ్యత నాది. కానీ ఒక షరతు" అన్నారు పరమేశంగారు.

"చెప్పండి! ఎలాంటి షరతులకైనా నేను అంగీకరిస్తాను" అన్నాడు గొంతుకు పూడుకుపోతూండగా.

"నువ్వు మా అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలి" అన్నారు పరమేశంగారు.

రాజు ఆశ్చర్యపోయాడు.

పరమేశంగారు ఇలాంటి షరతు పెడతారని వూహించలేదు ఏదైనా పెద్ద మొత్తంలో డబ్బు లంచం ఇమ్మంటాడని అనుకున్నాడు. కానీ ఇది ఇలా వుంటుందని తను ఎంత మాత్రం అనుకోలేదు.

ఇప్పుడు తను ఆలోచించటానికైనా సమయంలేదు.

తన ఉద్యోగం పూడకుండా వుండాలంటే, తను పొట్ట పోషించుకోలేని పరిస్థితికి దిగజారకుండా వుండాలంటే పరమేశంగారు ఏది చెప్పినా దానికి అంగీకరించి తీరాలి.

ఏమైతే అది అవుతుందని "సరే" అన్నాడు.

ఆ రోజు సాయంకాలం రాజుని తన వెంట పెట్టుకుని ఇంటికి తీసుకువెళ్ళారు పరమేశంగారు. కాఫీలు అందించేమిషతో అమ్మాయిని చూపించారు.

రాజు ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. అంతకంటే ఎక్కువగా ఆనందించాడు.

పరమేశంగారి అమ్మాయి ఏ అనాకారిగానో వుంటుందని వూహించాడు. కానీ, తన అభిప్రాయానికి భిన్నంగా ఆమె చాలా అందంగా వుంది. ఇంటరుపాసు అయిందట. చూడగానే ఆ అమ్మాయి రాజుకి అక్షరాలా నచ్చింది.

ఆ తరువాత వారంరోజులకి రాజు పెళ్ళి పరమేశంగారి అమ్మాయితో జరిగిపోయింది.


పరమేశంగారు రాజుకి దమ్మిడీ కట్నం ఇవ్వలేదు. సరిగదా ఒక జత బట్టలుకూడ పెట్టలేదు.

పోనీలే అనుకున్నాడు రాజు. తన ఉద్యోగం పోకుండా చూడటమేకాక, పిల్లనిచ్చి పెళ్ళి చేసాడు. అంతకంటే ఎక్కువ ఏమిటిలే అని తృప్తిపడాడు.

పరమేశంగారు ఎలా "మేనేజ్" చేసారో తెలియదు కానీ హెడ్డాఫీసుకి వెళ్ళవలసిన ఆ స్టేట్‌మెంట్ ప్రసక్తి మళ్ళీరాలేదు.

అందమైన అమ్మాయి భార్యగా లభించినందుకు రాజు సంతోషంగానే వున్నాడు. కానీ బంగారంలా పదివేల రూపాయల కట్నంవచ్చేది తనకి. అది కాస్తాసున్నా అయినందుకు అప్పుడప్పుడు మనసులో బాధగానే వుంటూంది రాజుకి.

ఇది జరిగిన నెలరోజులకు పరమేశంగారు లాంగ్ లీవుపెట్టాడు. ఆఫీసు చార్జి అంతా నెక్స్టు సీనియర్‌కు అప్పగించారు.






జుట్టు

"రవీ! నన్ను అల్లరిపెట్టిన వెధవని జుట్టు పట్టుకుని లాక్కొస్తానన్నావు వంటరిగా వచ్చావేం?" అడిగింది రమ.

"వాడికసలు జుట్టే లేదు. ఎలా?" అన్నాడు రవి.

—డి. జ్యోతి (సిర్పూర్ కాగజ్‌నగర్)

పరమేశంగారు తన ఆఫీసు అలమ్మిరాలను, డ్రాయరు సొరుగులను ఇరవైనాలుగు గంటలు తాళంవేసి వుంచేవారు. అందులో ఏముందో ఎవరికీ తెలియనిచ్చేవారు కాదు. అంతేకాక ఎవరికీ తన అలమ్మిరా తెరిచే అవసరం కానీ, అవకాశం కానీ లేకుండా చేసేవారు.

కాని ఆయన లీవులో వెళ్ళిన తరువాత అవసరాన్నిబట్టి అందరూ ఆ అలమ్మిరాని తెరుస్తూనే వున్నారు.

అయితే ఒకరోజున ఆ అలమిరాలో రాజుకి కనబడిన వస్తువు అతన్ని ఎంతో ఆశ్చర్యపరిచింది. తాను మిస్‌ప్లేస్ అయింది అనుకున్న ఆ నాటి బ్రాంచి రిపోర్టుల ఫోల్డరు భద్రంగా పరమేశంగారి అలమ్మిరాలో వుంది. ఆ తరువాత జరిగిన కరస్పాండెన్సుకూడ అంతా వాటితో బాటు ఫైలుచేయబడి వుంది.

జరిగిందేమిటో రాజుకి అర్థం అయిపోయింది.

పరమేశంగారే ఆ ఫోల్డరు దొంగిలించి తను ఏం జరుగుతుందో అని భయపడిచస్తున్న సమయంలో తనని కాపాడినట్లుగా నాటకం ఆడారు.

ఎంత మోసం!

కానీ ఖర్చు లేకుండా కూతురుపెళ్ళి చేయటంకోసం, తనని వాడుకున్న పరమేశంగారిపై "దట్ బ్లడీ ఓల్డు జాకాల్" అంటూ పళ్ళు నూరుకున్నాడు రాజు.

ఇప్పుడు రాజుకి పరమేశంగారికి మధ్య మాటలులేవు, ఆఫీసు విషయాలు "త్రూ" పేపరుగానీ మెసెంజరుద్వారాగానీ జరుగుతున్నాయి.